అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్ర యాదవ్

బొంరాస్‌పేట, జూలై 23 : జీరో నుంచి ఐదేండ్లలోపు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించడానికి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వీరికి వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్, మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం కింద బొంరాస్‌పేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి 0-5 ఏండ్ల లోపు పిల్లల్లో శారీరకంగా, మానసికంగా ఎలాంటి లోపాలు ఉన్నాయో గుర్తించాల్సి ఉంటుందని అన్నారు. పిల్లల్లో ఇలాంటి లోపాలను గుర్తిస్తే వారికి మెరుగైన చికిత్స అందించి ఆరోగ్య వంతులుగా చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. బుధవారం రెండవ రోజు కూడా శిక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివరాజ్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

కట్టుకాల్వతండా పాఠశాలలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బొంరాస్‌పేట, జూలై 23 : జాతీయ విద్యా విధానం ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రారంభమైంది. 27వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ ఒక అంశంపై విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. మంగళవారం రెండవ రోజు పాఠశాలల్లో ఎఫ్ఎన్ఎల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. గణితంలో వివిధ రకాల కృత్యాలను విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పరిగి, జూలై 23: పరిగి మండలం నస్కల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఆరుగురు ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలు గుర్తు చేస్తూ చక్కని విద్యాబోధన చేసే ఉపాధ్యాయులను అందరూ గుర్తు ఉంచుకుంటారని తెలిపారు. మాజీ సర్పంచ్‌లు పద్మమ్మ, కాసుల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ నాగేశ్, ఎస్ఎంసీ చైర్మన్‌లు మాణిక్యం, మల్లేశ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గత కొని సంవత్సరాలుగా పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కులకచర్ల ముదిరాజ్ సంఘం నాయకులు

కులకచర్ల, జూలై 23 : ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు గాదె మహిపాల్ అన్నారు. రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘం ఆధ్వ ర్యంలో తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలని డిమాండు చేశారు. దీంతో పాటు ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటీవ్ సొసైటీని ఏర్పాటు చేయాలన్నారు. ముదిరాజ్ కార్పోరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పి అనంతయ్య, నర్సింహులు, ఆంజనేయులు, రాజు, భీమయ్య, చెన్నయ్య, శ్రీశైలం, శ్రీనివాసులు, చందు, మహేందర్, ధనుంజయ్, అంజిలయ్య, లక్ష్మయ్య, శివయ్య, మండల ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెద్దేముల్ ఎంపీవోగా రతన్‌సింగ్ బాధ్యతలు..

పెద్దేముల్, జూలై 23 : మండల నూతన ఎంపీవోగా వి.రతన్‌సింగ్ నియామకమయ్యారు.ఈ మేరకు మంగళవారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓగా విధులు నిర్వహించిన రతన్‌సింగ్ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.గతంలో ఇక్కడ ఎంపీవోగా పనిచేసిన షేక్ సుష్మా లాంగ్‌లీవ్‌లో వెళ్లగా కొంతకాలంగా కందనెల్లి గ్రామ సీనియర్ పంచాయతీ కార్యదర్శి కె.రమేశ్‌కుమార్ మండల ఇన్‌చార్జి ఎంపీఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్‌సింగ్ మీడియాతోమాట్లాడుతూమండల అభి వృద్ధికి కృషిచేస్తానని, మండల ప్రజలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సహకరిం చాలని కోరారు. అనంతరం రతన్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు.

పాషాపూర్‌లో పానీ పరేషాన్

మూడు రోజులుగా తాగునీరు లేక గిరిజన తండా ప్రజల ఇబ్బందులు

గ్రామంలో ఓ ఇంటి ముందు నల్లాలు, నీరు తీసుకురావడానికి వెళుతున్న మహిళలు , బైక్‌పై యువకులు..

పెద్దేముల్, జూలై 23: మండల పరిధిలోని పాషాపూర్ గ్రామంలో మూడు రోజుల నుంచి తాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పాషాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వాటర్ సప్లైకి సంబంధించిన బోర్ మోటారు గత ఆదివారం కాలిపోయింది. దానిని ఇప్పటి వరకు రిపేర్ చేయించలేదు. మరోవైపు మిషన్ భగీరథ నీరు కూడా రెండు రోజుల నుంచి రావడం లేదు. దీంతో స్థానికంగా పంట పొలాల వద్ద ఉన్న బోర్ మోటరు గ్రామానికి సమీపంలో ఉన్న ఎర్రమట్టి క్వారీలో ఉన్న సింగల్ ఫేజ్ మోటరు నుంచి, పక్క గ్రామాల నుంచి ఆటోలో, ఖాళీ నడకనా నీటిని తెచ్చుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఆ గ్రామం వైపు ఏ అధికారి కూడా చూడడం లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి పాషాపూర్ గ్రామ ప్రజల నీటి కష్టాలను తీర్చాలని అధికారులను వేడుకొంటున్నారు.

వనమహోత్సవంతో పర్యావరణ పరిరక్షణ

కులకచర్ల: పీరంపల్లి పాఠశాలలో మొక్కను నాటుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బొంరాస్‌పేట పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన నాయకులు

కులకచర్ల, జూలై 23 : వనమహోత్సవంతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పీరంపల్లి గ్రామ పాఠశాలలో మొక్కలు నాటాలి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీమ్, ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య, పంచా యతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: మండలంలోని కట్టుకాల్వతండా పాఠశాలలో మంగళవారం మన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం శోభారాణి, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, మాజీ సర్పంచ్ మహేందర్, కాంగ్రెస్ నాయకుడు బీంరెడ్డి తదితరులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. నాటిన మొక్కలను కాపాడటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలని..

తహసీల్దార్‌కు వినతి

తహసీల్దార్ వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు,జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన బీసీ రిజర్వేషన్ల హామీని వెంటనే అమలు చేయాలని బీజేపీ ఒబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.మల్లేశ్, ఒబీసీ మోర్చా అధ్యక్షుడు రమేష్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ పేర్కొన్నారు. పూడూరు మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డికి ఒబీసీ రిజర్వేషన్ అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 23 శాతం ఉన్న ఒబీసీ రిజర్వేష్లను వెంటనే 42 శాతం ముందుగా మాటిచ్చిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రదాన కార్యదర్శు రామ చంద్రయ్య, రాఘవేందర్‌రెడ్డి, రాజు, మాణిక్యం,నర్సింహులు,శివరాజ్,సుబాన్, మల్లేశ్, బుచ్చన్న, విఠల్, శ్రీనివాస్, సత్యనా రాయణ తదితరులు ఉన్నారు.

యువత 'మత్తు' కు దూరంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్సై మల్లేశం

మర్పల్లి, జూలై 23 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై మల్లేశం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, పట్టుబడితే వాహన యజమానిపై కేసు చేయడంతో పాటు లైసెన్స్‌ను కూడా రద్దు చేసామన్నారు. వాహనాలకు నంబర్ ప్లేటు ఉండాలని, అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సూచించారు. యువత మత్తుకు అలవాటు పడి విలువైన నిండు జీవితాన్ని పాడు చేసుకోవద్దని తల్లిదండ్రులకు తమ పిల్లలకు తెలపాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వీరేశలింగం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

మర్పల్లి, జూలై 23 : వర్షం పడిందంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని మర్పల్లి మండల కేంద్రానికి అనుబంధ గ్రామమైన మర్పల్లి తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా ఎవరు పట్టించుకోవడంలేదని వాపో యారు. తమ తండాకు సీసీ రోడ్డు వేయాలని పలుమార్లు ప్రజా ప్రతినిధు లకు, అధికారులకు తెలిపినా ఫలితం లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తండాకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని తండ వాసులు కోరు తున్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దరఖాస్తులను స్వీకరిస్తున్న మండల వ్యవసాయ అధికారి షేక్ నజీరొద్దీన్

పెద్దేముల్, జూలై 23 : రైతుబీమాకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని రైతులు,అదే విధంగా జూన్ 28వరకు కొత్త పట్టాపాస్ బుక్ వచ్చి దరఖాస్తు చేసుకోని రైతులు వెంటనేదరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ నజీరోద్దీన్ సూచించారు.ఈ మేరకు మంగళవా రం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతుబీమాకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పాస్‌బుక్‌లు వచ్చిన రైతులు తమ రైతుబీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం,రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డులను స్థానికంగా ఉన్న ఏఈఓలకు అందించి వారి సమక్షంలో దరఖాస్తు మీద సంతకం చేసి సమర్పించాలన్నారు. అదే విధంగా రైతురుణమాఫీలో ఏమైనా రైతులకు ఇబ్బందులు ఉంటే బ్యాంకుల్లో రుణం తీసుకున్న వారి ఆధార్ కార్డు తీసుకొస్తే రుణమాఫీ వర్తించిందా లేదా అనేది చూసి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల ఏఈవోలు బాలకో టేశ్వర్లు, స్వాతి, వినయ్, శివరత్, రజిత, బీటీఎం శ్రావణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను

రిలీవ్ చేయాలి

పీఆర్‌టీయూ నేత కడియాల

ధారూరు, జూలై 23: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి, వారికి కేటాయించిన స్థానాల్లో అవకాశం కల్పించాలని జిల్లా పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని మున్నూరు సోమవారం, కుక్కిందా, కాచారం, గడ్డమీది గంగారం, నర్సాపూర్, దర్మాపూర్, రుద్రారం తదితర పాఠ శాలల్లోని ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్న తులు, బదిలీలు పూర్తి కావడంతో చాలామంది ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి మాణిక్యం, రవీందర్‌రెడ్డి, శేఖర్, సుదర్శన్, సుధాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గేతో..ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి,జూలై 23 : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లికార్జున్ ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఖర్గే ను కలిసిన వారిలో ఆయనతో పాటు మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటోల్ కూడా ఉన్నా రు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై చర్చించారు. గత శాసన సభ ఎన్నికల్లో నానా పటోల్ తెలంగాణ రాష్ట్రంలో పర్యటించడాన్ని గుర్తు చేసుకుంటూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గెలుపు పట్ల ఖర్గే అభినందించారు.

భూ సమస్యలను పరిష్కరించాలని వినతి

భూసమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌కు కలిసి వినతిపత్రం సమర్పించిన మక్తవెంకటాపూర్ గ్రామస్తులు

కులకచర్ల, జూలై 23 : చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం సందర్శించారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. కాగా మండలంలో ఉన్న భూసమస్యలను పరిష్కరిం చాలని మండల నాయకులు జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి పత్రం సమర్పిం చారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అద నపు కలెక్టర్‌ను మండల నాయకులు, గ్రామస్తులు, రైతులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల తహసీల్దార్ ప్రభులు, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాయక్, నాయకులు యాదయ్య, సలీమ్, వెంకటయ్యగౌడ్, శేఖర్, వెంకట్, యాదయ్య, గోపాల్, మండల ప్రజలు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యపై అవగాహన

గుణాత్మక విద్యపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌వో దేవి

కులకచర్ల, జూలై 23: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషిచేస్తున్నామని కులకచర్ల కస్తూర్బాగాంధీ పాఠశాల ఎస్‌వో దేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులతో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించి గుణాత్మక విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, జూలై 23 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిషత్‌కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గుంతల్లో నీళ్లు నిల్వకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమలు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని అన్నారు. మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రతి ఇంటికీ మొక్కలు అందజేసి వాటిని నాటి సంరక్షించేలా కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీమ్, ఏపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

దరఖాస్తు దారులతో మాట్లాడుతున్న డీపీవో జయసుధ

మర్పల్లి, జూలై 23 : పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీవో జయసుధ అన్నారు.. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రంగా ఉంచాలని, నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.. మంచినీటి ట్యాంకులను ప్రతి వారం శుభ్రం చేయాలని సూచించారు.. అంతకుముందు మీసేవా కేంద్రాన్ని సందర్శించి మీ సేవలో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారని మీసేవ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ దరఖాస్తు దారులను ఎవరైనా అధిక రుసుం వసూలు చేస్తున్నారా అని అడిగారు. అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఎంపీడీవో రాజమల్లయ్య, ఆర్ఐ మాధవరెడ్డి, కార్యదర్శులు లక్ష్మీకాంత్, రవికుమార్ ఉన్నారు.